ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

మంగళవారం | జూన్ 09, 2026 | సంపుటి : 7 | సంచిక : 10 | పేజీలు : 2

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్



**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం అనువైన ప్రభుత్వ పాఠశాలలను గుర్తించే ప్రక్రియలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సోమవారం కాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీహెచ్ఎస్), శాయంపేట జాగీర్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల విస్తీర్ణం, మౌలిక వసతులు, తరగతి గదులు, క్రీడా మైదానాలు, విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ విస్తరణకు ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, తహశీల్దార్ రాజు, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఎంఈఓ మనోజ్ కుమార్, విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

# బీజేపీ ఎంపీలు తెలంగాణకు ఏం తెచ్చారు?

- మోదీ ఏం చేశారో? నేనేం చేశానో చర్చకు సిద్ధం
- ఎన్నికలకు 6 నెలల ముందు రాజకీయాలు మాట్లాడుకుందాం
- ఈ రెండేళ్లు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం
- హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు కట్టి పేదలకు ఇస్తాం
- సైబరాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన



**హైదరాబాద్, ఆయుధం:** ఔటర్ రింగు రోడ్డు లోపలి 1.34 కోట్ల మందికి మౌలిక వసతుల కల్పన, ఇతర అంశాల్లో పాలనా సమన్వయం కోసమే మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సైబరాబాద్‌లో రూ. 1,674.74 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు 6 నెలల ముందు రాజకీయాలు మాట్లాడుకుందామని, ఈ రెండేళ్లు కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. సైబరాబాద్‌లో అనేక ఐటీ కంపెనీలు ఉన్నాయని, దేశ ఐటీ ఎగుమతుల్లో 16.77 శాతం హైదరాబాద్ నుంచే వెళ్తున్నాయని చెప్పారు. "దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయి. ఈ ప్రధాన నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. కాలుష్యం వల్ల దిల్లీలో స్కూళ్లు, ప్రధాని కార్యాలయాన్నే మూసేశారు. మన హైదరాబాద్ నివాసానికి అనుకూలంగా ఉంది. పెద్ద నగరాలకు ఉన్న సమస్యలు హైదరాబాద్‌లో లేకుండా చూసేందుకు నిపుణులతో కమిటీ వేశాం. మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో భవిష్యత్తు తరాలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తెలంగాణ నుంచి 8 మంది భాజపా ఎంపీలను పంపిస్తే మోదీ ప్రధాని అయ్యారు. మరి ఆ ఎంపీలు తెలంగాణకు ఏం తీసుకొచ్చారు. రెండేళ్లలో ఏం చేయలేదని నన్ను అంటున్నారు.. మరి మీరేం చేశారు? నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుపుల్ల పెట్టారు. సబర్మతి, గంగా, యమున నదులను ప్రక్షాళన చేస్తే ఆహా ఓహో అన్నారు. మూసీ ప్రక్షాళనకు సహకరించమని భాజపా ఎంపీలు మోదీని అడిగారా? 12 ఏళ్లుగా మోదీ ఏం చేశారో? రెండేళ్లు సీఎంగా నేను ఏం చేశానో చర్చకు సిద్ధం. గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్‌ను నిర్మిస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## భగవాన్ దాస్ పోరాటంతోనే కోచ్ ఫ్యాక్టరీ



- బీఆర్ జయంతి వేడుకలో వరంగల్ ఎంపీ కడియం కావ్య
- కోచ్ ఫ్యాక్టరీకి భగవాన్ దాస్ పేరు పెట్టాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు

2 లో

**హనుమకొండ, ఆయుధం :** బీఆర్ భగవాన్ దాస్ పోరాటంతోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమ రూపం సంతరించుకుని నేడు నిజం కాబోతున్నదని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం సీనియర్ కమ్యూనిస్టు యోధుడు, కార్మిక నాయకులు బీఆర్ భగవాన్ దాస్ 96వ జయంతి వేడుకలు హనుమకొండ అశోక జంక్షన్ లోని బీఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు.



2 లో

## ప్రజా వ్యతిరేక బీజేపీనే ప్రజలు తరిమికొడతారు

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

"దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నది కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ... దేశం కోసం ఇందిరాగాంధీని, రాజీవ్ గాంధీని త్యాగం చేసింది కాంగ్రెస్ పార్టీ." ఇంతటి గొప్ప చరిత్ర కలిగి ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు రజాకార్ల పాలనతో పోల్చడం అవివేకమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు.





## టెండర్ విధానం రద్దుచేసి టెస్కో ద్వారానే ఖరీదు చేయాలి

- వరంగల్ కలెక్టరేట్ ముందు చేనేత కార్మికుల ధర్నా
- ప్రభుత్వం స్పందించకుంటే పోరాటం ఉధృతం

**వరంగల్, ఆయుధం:** చేనేత కార్మికుల ఎడల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం హనుమకొండ ఏకశిల పార్కు నుండి వందలాది మంది మహిళలతో సహా చేనేత కార్మికులు వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, పీసీసీ చేనేత సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంటటేశ్వర్లు, ఆప్కో మాజీ డైరెక్టర్ డి.సత్యనారాయణ మూర్తి, మాజీ కార్పొరేటర్స్ కుసుమ సతీష్, యెలుగం చిన్న భద్రయ్య, వన్నాల వెంకటరమణ, ఆడెపు రవీందర్ తదితరులు ధర్నాను ఉద్దేశించి ప్రసంగించారు. ఎనిమిది రోజులుగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో మగ్గాలు బంద్ పెట్టి ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించనందున శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వెంటనే స్పందించి టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ శాఖలకు అవసరమైన బెడ్డింగ్ మెటీరియల్ యధావిధిగా టెస్కో సంస్థకు మిగతా 2లో..

## నీట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ, ఆయుధం:** ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ 2026 ప్రవేశ పరీక్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నిర్వహణ, వైద్య సేవలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన పరీక్ష అని, అందువల్ల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, తగిన బెంచీలు, ఫ్యాన్లు, లైటింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గదర్శకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స సదుపాయాలు, అవసరమైన వైద్య సిబ్బంది, అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పరీక్ష నిర్వహణలో పాల్గొనే కేంద్ర నిర్వాహకులు, ఇన్విజిలేటర్లకు మార్గదర్శకాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, పరీక్ష గోప్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియలో నిర్దేశిత నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నీట్ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీట్ పరీక్ష జిల్లా కోఆర్డినేటర్, నోడల్ అధికారి బిక్షపతి, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీశంకర్, ఈడీఎం శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీకి సైనికుడిలా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

**వరంగల్, ఆయుధం:** ప్రతీ బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీకి సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పేర్కొన్నారు. సోమవారం వరంగల్ లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అబ్జర్వర్ శంకర్ నాయక్ ఎమ్మెల్సీ, కేతూరి వెంకటేష్, షామీర్పేట్ రాజేష్ తో కలిసి బూత్ స్థాయి నాయకులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే కాదు ఓటర్ల జాబితాల సవరణ జరిగే ప్రతి దశలోనూ మిగతా 2లో..



## మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలందించాలి

2 లో

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం

## పారా క్రీడాకారులకు రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి





**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రూప్స్, ఇతర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో జీవో నెం.74 ప్రకారం పారా క్రీడాకారులకు కల్పించాల్సిన 2 శాతం రిజర్వేషన్లు ఇప్పటివరకు సమర్థవంతంగా అమలు కాలేదని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీ గాడిపల్లి ప్రశాంత్ పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ లోని గ్రేటర్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ప్రతిభ కనబరిచిన అనేక మంది దివ్యాంగ క్రీడాకారులు విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక క రంగాలలో తీవ్ర నష్టపోతున్నామని తెలిపారు. 2023 లో హైకోర్టు జీవో నెం.74 ప్రకారం స్పోర్ట్స్ కోటాలో పారా స్పోర్ట్స్ ను కూడా చేర్చి 2% రిజర్వేషన్లను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదని వాపోయారు. 2025 నూతన క్రీడా విధానం అమలులోకి వచ్చే పది నెలలు గడుస్తున్నప్పటికీ, పారా క్రీడాకారుల సంక్షేమం, ఉద్యోగ అవకాశాలపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా క్రీడలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం పారా క్రీడాకారుల ప్రస్తావన లేకపోవడం బాధాకరమని అన్నారు. ఇటీవల విడుదల చేసిన ఏఈఈ ఉద్యోగ నోటిఫికేషన్ లో దివ్యంగా క్రీడాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని... తక్షణమే ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్లను నిలిపివేయాలని కోరారు. పారిస్ పారాలింపిక్స్లో టి20 విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించిన అర్జున అవార్డు గ్రహీత జీవంజి దీప్తి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన గ్రూప్2 ఉద్యోగ నియామకం, 500 గజాల ఇంటి స్థలము రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు అమలు కాకపోవడం విచారకరం అన్నారు. జీవో నెం.74 అమలు కాకపోవడం వల్ల టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్1 నియామక ప్రక్రియలో కూడా పారా క్రీడాకారులు నష్టపోయారన్నారు. ఈ నేపథ్యంలో గ్రూప్1 కేటగిరిలో పారా స్పోర్ట్స్ రిజర్వేషన్ కింద నిలిపివేయబడిన ఒక పోస్టును దివ్యాంగ క్రీడాకారులకు కేటాయించి న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో గౌతమ్ యాదవ్, దూడల శ్రీనివాస్, వక్కల రాజు, భాను ప్రసాద్, నితీష్, ప్రవీణ్, అబ్దుల్, శివ, రమాదేవి పాల్గొన్నారు.



## శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో అభిషేకం

**వరంగల్, ఆయుధం;** వరంగల్ లోని ఆకారపు వారి గుడి శ్రీ కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం అధిక మాసం పురుషోత్తమ మాసం అష్టమి పురస్కరించుకొని స్వామివారిని 33 రజిత బిల్వ దళాలతో అలంకరించారు. స్వామివారికి పంచామృత అభిషేకం చేసి మహాకాళేశ్వరుడుగా అలంకరించి నీరాజనం మంత్రపుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు లంకా శివకుమార్ ఫణి శర్మ, ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఆకారపు హరీష్, స్వాతి దంపతులు, ఆలయ ఈవో పి.కిషన్ రావు, సాగర్, నగేష్, లక్ష్మి, అరుణ, మాధురి, లక్ష్మి, సునీత, వాణి, సతీష్ కుమార్, స్వాతి, యువరాజ్, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

## నేడు నీటి సరఫరా బంద్

**వరంగల్, ఆయుధం:** కాకతీయ మెడికల్ కళాశాల (కే ఎం సి)లో గల వాటర్ ట్యాంక్ వాల్వ్ కు మరమ్మత్తు పనులు కొనసాగుతున్నందున నేడు (మంగళ వారం) నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా ఈ ఈ రవి కుమార్ నేడోక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భం గా ఇట్టి ట్యాంక్ పరిధి లోని రంగం పేట, దత్త క్షేత్రం, పోతన నగర్, రాజీవ్ కాలనీ, పాపయ్య పేట చమాన్, మున్సిపల్ క్వార్టర్స్ ,కృష్ణ మందిర్ వెనకాల, భద్రకాళి రోడ్డు ములుగు రోడ్డు, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో మంగళ వారం నీటి సరఫరా జరగదని స్థానిక కాలనీ వాసులు ఇట్టి విషయాన్ని గమనించి బల్దియా కు సహకరించాలని ఈ ఈ కోరారు.

## హనుమకొండ డీఎంహెచ్వో గా డాక్టర్ ఎస్. దుర్గా రామ్ కుమార్



**హనుమకొండ, ఆయుధం:** వైద్య ఆరోగ్య శాఖ బదిలీల్లో భాగంగా హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ఎస్.దుర్గా రాంకుమార్ ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ని కలిసి ఆయన రిపోర్ట్ చేశారు. కూకట్ పల్లి జోన్ డిఎంహెచ్వో గా పని చేసిన దుర్గా రాంకుమార్ బదిలీపై హనుమకొండకు వచ్చారు. ప్రస్తుతం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ అల్లం అప్పయ్య ను ములుగు జనరల్ ఆస్పత్రి ఆర్ఎంఓ గా నియమించారు. నూతన డీఎంహెచ్‌వో దుర్గా రామ్ కుమార్ అదనపు కలెక్టర్ ఎన్.రవి, డిఆర్ఓ శ్రీనివాస్ లను మర్యాద పూర్వకంగా కలిశారు. డిప్యూటీ సివిల్ సర్జన్ లుగా డాక్టర్ సిహెచ్.మురళి, డాక్టర్ పవిత్ర జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అధికారులు సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్వో మదన్ మోహన్ రావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ రుబీనా అప్రోజ్ ఏవో కోలా రాజేశ్, జిల్లా మాస్ ఎడ్యుకేషన్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, HEEO చంద్రశేఖర్, డిపిఓ రుక్ముద్దీన్, ప్రసన్న కుమార్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక బీజేపీనే ప్రజలు తరిమికొడతారు

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**వరంగల్, ఆయుధం:** ''దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నది కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ... దేశం కోసం ఇందిరాగాంధీని, రాజీవ్ గాంధీని త్యాగం చేసింది కాంగ్రెస్ పార్టీ.'' ఇంతటి గొప్ప చరిత్ర కలిగి ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు రజాకార్ల పాలనతో పోల్చడం అవివేకమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలోని 111 అసెంబ్లీ నియోజకవర్గాల్లో డిపాజిట్లు కోల్పోయిన బీజేపీ ఇవాళ ఏం మాట్లాడుతుందో ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగనివ్వం అని బీజేపీ వాళ్లు మాట్లాడటం హాస్యాస్పదం అని బండి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనకు, దేశంలో మోడీ పాలనకు తేడాను ప్రజలు స్పష్టంగా లెక్కలు వేస్తున్నారని, త్వరలోనే బీజేపీ వాళ్లను గ్రామాలకు రాకుండా ప్రజలే తరిమి కొడతారని బండి హెచ్చరించారు. తెలంగాణలోనే కాదు, ఈ దేశంలో ఎక్కడ కూడా కాంగ్రెస్ పార్టీని ఆపే దమ్ము బీజేపీకి లేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

తెలంగాణ రాష్ట్రం నుంచి వసూలు చేసే 100 శాతం పన్నుల్లో 25 శాతం కూడా తిరిగి రాష్ట్రానికి ఇవ్వకుండా సవతి తల్లి ప్రేమను చూపిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని దమ్ముంటే ప్రశ్నించాలని రాంచందర్ రావుకు బండి సవాల్ విసిరారు. ఇలాగే తెలంగాణ ప్రాజెక్టులకు, అభివృద్ధి పనులకు నిధులివ్వకుండా మోకాలడ్డితే, కేంద్రానికి పన్నులు చెల్లించకుండా, ఆ నిధులతో ఇక్కడే అభివృద్ధి చేసుకుంటాం అని హెచ్చరించారు. దేశ ప్రజలపై జీఎస్టీ భారం మోపి ప్రజల రక్తాన్ని పీల్చుతున్న కేంద్రం, మళ్లీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ఎడాపెడా పెంచుతూ సామాన్యులపై భారం మోపుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని బండి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సామాన్యుల సంక్షేమం కోసం పనిచేస్తే, ప్రజల బాధలను పట్టించుకోకుండా బీజేపీ సంపన్న వర్గాలకు కొమ్ముకాస్తున్నదన్నారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా ప్రధాని మోడీకి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమమే నడిపించి, గద్దె దించాలని, రాహుల్ గాంధీని ఈ దేశానికి ప్రధానిని చేయాలని బండి సుధాకర్ గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి


- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**హనుమకొండ, ఆయుధం:** అప్పగించిన విధులను అధికారులు సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. ఏఆర్ఎస్ఐ నుంచి ఆర్ఎస్ఐగా పదోన్నతి పొందిన ఏ.కుమార స్వామి సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన భుజాలపై పదోన్నతి చిహ్నాన్ని సీపీ అలంకరించారు. విధుల్లో ఎల్లప్పుడూ నిజాయితీగా ఉంటూ, ఉన్నతాధికారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు.

# మన ఊరు బడి మన పిల్లల బంగారు భవిష్యత్తు

- సర్పంచ్ బండి రేణుకా శంకర్
- బడిబాట కరపత్రం ఆవిష్కరణ




**నడికూడ, ఆయుధం:** నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ బడిబాట కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి రేణుక శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య, గుణాత్మక విద్య అందుతుందని అన్నారు. పాఠశాలలో మంచి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం ఉన్నదని తెలిపారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరము నుండి పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభమయ్యాయని.. నాలుగు సంవత్సరాలు నిండిన టువంటి పిల్లలను మన ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇక నుండి చేర్పించవచ్చని ఈ సందర్భంగా తల్లిదండ్రులను కోరారు. మన ఊరిలో ప్రభుత్వ బడి ఉండగా ప్రైవేట్ బడులకు పంపడం ఎందుకని, మన ఊరు బడి మన పిల్లల బంగారు భవిష్యత్తు అని పేర్కొన్నారు. నేడు మీ పిల్లలను చేర్పించండి రేపటి భవిష్యత్తును నిర్మించండి అని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు పుల్లూరి రామకృష్ణ, తల్లిదండ్రులు చిరంజీవి, సుధ, పాల్గొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీకి సైనికుడిలా పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇప్పటి వరకు ఓట్లు వేసాం కదా అని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రేపు మన ఓటే జాబితాలో లేకుండా చేసే ప్రమాదం ఉంది అని హెచ్చరించారు. పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల పేరుతో జరిగిన అవకతవకల కారణంగా ముఖ్యమంత్రులుగా పనిచేసిన నాయకులే తమ సొంత నియోజకవర్గాల్లో ఓడిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. అందుకే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ప్రతి BLA, ప్రతి బూత్ అధ్యక్షుడు ఓటు హక్కు పరిరక్షణ కోసం యోధుడిలా పనిచేయాలి అని కొండా మురళి పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఓటు చోరీ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత లేకపోవడంపై చేస్తున్న పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీ కోసమే కాదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమేనని అన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని కొండా మురళి పేర్కొన్నారు. BLAలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించాలని, కొత్త ఓటర్ల నమోదు, మారిన చిరునామాల సవరణ, తొలగించబడిన పేర్ల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా చూడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని చెప్పారు. ఓటర్ల జాబితానే ఎన్నికల్లో విజయానికి తొలి అడుగు బూత్ బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది. బీజేపీ కుట్రలను క్షేత్రస్థాయిలోనే తిప్పికొట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఈ సందర్భంగా కొండా మురళి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పోలింగ్ బూత్ ఏజెంట్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు

- తాజా మాజీ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్



**వరంగల్, ఆయుధం:** ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారం కోసం కృషి చేయడానికే గ్రామసభలు అని తాజా మాజీ 37వ డివిజన్ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ అన్నారు. ఈ సందర్భంగా 37వ డివిజన్ తూర్పుకోట పోచమ్మ గుడి ఆవరణంలో 99 రోజుల యాక్షన్ ప్లానింగ్ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభకు వార్డు ఆఫీసర్ రవి అధ్యక్షతన జరిగింది. ఈ సభకు 37వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజలకు దగ్గరగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే గ్రామసభలు నిర్వహించి ప్రజలకు దగ్గర అయిందని ఈ క్రమంలో ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్ని రంగాలలో అభివృద్ధి జరిగిందని అన్నారు. సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళుతుందన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారం కోసం అధికారులతో నిరంతరం కృషిచేస్తున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో ప్రజా పాలనకు ప్రజలు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యల పైన ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్స్, ఉచిత కరెంటు, వివిధ అంశాల కోసం దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ అభిషేక్, ఎలక్ట్రికల్ ఏఈ రామకృష్ణ, జిపిఓ నరసింహస్వామి, వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్, బిల్ కలెక్టర్ మున్నం చందర్, రాంబాబు, శ్రీనివాస్ తదితరులు ప్రజలు పాల్గొన్నారు.

# భగవాన్ దాస్ పోరాటంతోనే కోచ్ ఫ్యాక్టరీ

- బీఆర్ జయంతి వేడుకలో వరంగల్ ఎంపీ కడియం కావ్య
- కోచ్ ఫ్యాక్టరీకి భగవాన్ దాస్ పేరు పెట్టాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**హనుమకొండ, ఆయుధం :** బీఆర్ భగవాన్ దాస్ పోరాటంతోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమ రూపం సంతరించుకుని నేడు నిజం కాబోతున్నదని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం సీనియర్ కమ్యూనిస్టు యోధుడు, కార్మిక నాయకులు బీఆర్ భగవాన్ దాస్ 96వ జయంతి వేడుకలు హనుమకొండ అశోక జంక్షన్ లోని బీఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు బీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ భగవాన్ దాస్ పోరాటంతోనే కోచ్ ఫ్యాక్టరీ సాధ్యమై నేడు పూర్తి కాబోతున్నదని, తద్వారా ఈ ప్రాంతంలో వేలాది మంది యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు అందనున్నాయని అన్నారు. అలాగే వరంగల్ కు తాగు నీరు, సాగునీటి కోసం బీఆర్ భగవాన్ దాస్ పోరాడాలని, భూ పోరాటాలు నిర్వహించి పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టారని అన్నారు. తన జీవిత కాలం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన భగవాన్ దాస్ రాష్ట్ర స్థాయిలో సిపిఐకి పేరు తీసుకు వచ్చారని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ, సిపిఐ ఎప్పుడూ మిత్ర పక్షాలుగా కొనసాగుతూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసి ముందుకు సాగుతున్నాయని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి భగవాన్ దాస్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన పోరాటంతోనే కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని అన్నారు. బీఆర్ ఆశయాలకు అనుగుణంగా మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. భగవాన్ దాస్ చూపిన బాటలో కమ్యూనిస్టు కార్యకర్తలుగా ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బి. రాజ్ సిద్ధార్థ, బీఆర్ లెనిన్, బిఆర్ఎస్ నాయకులు మేడిపల్లి శోభన్ బాబు, ఆవోపా జిల్లా అధ్యక్షులు డి. ఈశ్వరయ్య, జర్నలిస్టు సంఘాల నాయకులు తోట సుధాకర్, కేకే, పి. అశోక్, గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను,సిపిఐ జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, నేదునూరి రాజమౌళి, ఏదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, బికేఎంయూ జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు గుండె బద్రి, కండె నర్సయ్య, మాలోతు శంకర్ నాయక్, ఎం. స్వామి చరణ్, రవీందర్,జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# టెండర్ విధానం రద్దుచేసి టెస్కో ద్వారానే ఖరీదు చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)




ఆర్డర్ ఇప్పించి పేద చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ మరియు కరీంనగర్ జిల్లాలో 50,000 మందికి పైగా చేనేత కార్మికుల జీవనోపాధిని దెబ్బ తీసే విధానాన్ని విడనాడకుంటే రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మిక ఉద్యమం ఉధృతమైతే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. చేనేత కార్మికులను నిర్లక్ష్యం చేస్తే అందుకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు. ఈ నిరసన ప్రదర్శన ధర్నా కార్యక్రమానికి చేనేత సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షులు పంతగాని శ్రీనివాస్, కార్యదర్శి మాషబత్తుల కుమారస్వామి, చేనేత నాయకులు ఆడెపు రవిరాజు, అడిగొప్పుల సంపత్, వొడ్నాల నరేందర్, వైద్యం రాజగోపాల్, యెలుగం వెంకటమల్లు, కొలిపాక మధునయ్య, కూరపాటి సంపత్, వూషకోయల వీరస్వామి ,దువ్వల రాజేందర్ , బూర వేణు ,ఆకునూరి జయరాజ్, కోడూరి రమేష్, యెలుగం సాంబయ్య, ఆడపు రవి, యెలుగం శ్రీనివాసు, కోట మల్లయ్య, పొన్నం మాధవి, పసునూరి రమాదేవి, దాసరి సునీత, యెన్నం సత్యకళ తదితరులు నాయకత్వం వహించారు. ధర్నా అనంతరం చేనేత ప్రతినిధి వర్గం జిల్లా కలెక్టర్ ను కలిసి సమస్యలు వివరించి ముఖ్యమంత్రి కి పంపించే వినతి పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

## 8మంది ఇన్స్ స్పెక్టర్ల బదిలీ

**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీఆర్లో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది ఇన్స్పెక్టర్లకు వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కె.ప్రవీణ్ కుమార్ హనుమకొండ ట్రాఫిక్, సుబ్బారెడ్డి టాస్క్ ఫోర్స్, దేవేందర్ టాస్క్ ఫోర్స్, దామోదర్ రెడ్డి సీసీఆర్‌బీ, చేరాలు ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్, ఓ.రమేష్ AHTU, A.ప్రవీణ్ కుమార్ పీసీఆర్, కమాండ్ కంట్రోల్ అదనపు బాధ్యతలు అప్పగించడమైంది.

# శాయంపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- ఆనందోత్సవాలు, ఆత్మీయ పలకరింపులు,
- 45 వసంతాల కలయికల సన్మాన సౌరంభాలు,
- షష్టిపూర్తికి వేదికైన సమ్మేళనం



**శాయంపేట, (ఆయుధం):** వారంతా పూర్వ విద్యార్థులు.. 45 వసంతాల ఎడబాటులో మళ్లీ కలుసుకున్న ఆనందోత్సవాలు, ఆత్మీయ పలకరింపులు.. ఎన్నో భావోద్వేగాలు, సుమధుర దరహాసాలు, చదువులమ్మ ఒడిలో సేద తీర్చుకున్న గత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. శాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 198081 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేడుకలు నిర్వహించుకున్నారు. వేడుకలను పురస్కరించుకొని దైవ సమానులైన వారి గురువులను పూలజల్లులతో వేదికపై ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. తొలుత అకాల మృతి చెందిన సహచర మిత్రుల చిత్రపటాలకు తోటి విద్యార్థులు గురువులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చింతల ఉమ, స్థానిక సీ ఐ ఎస్ ఐలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థి సీనియర్ జర్నలిస్ట్ మామిడి రమేష్ స్వర పరిచిన పాటల సీడీని అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. వేడుకలను పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులు సామూహికంగా షష్టిపూర్తి వేడుకలను కూడా ఇదే వేదికపై సుమారు 60 జంటలు ఘనంగా జరుపు కొన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాల్లో భాగంగా ఇంతకు ముందు ఎవ్వరు జరుపుకోనీ విధంగా ఈ బ్యాచ్ నిర్వహించుకోవడం చారిత్రాత్మకంగా నిలిచింది. ఒకే పాఠశాలలో చదివిన విద్యార్థులంతా ఉద్యోగ వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆలస్యమైనా అందరం కలుసుకోవాలని సదుద్దేశంతో ఈ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకొని విజయవంతం చేసుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషిచేసిన విద్యార్థుల్లో పున్నం రవీందర్ రెడ్డి (నర్సంపేట ఏసీపీ), మామిడి రమేష్, (సీనియర్ జర్నలిస్ట్), సిహెచ్.ప్రకాష్ రావు (రిటైర్డ్ హెచ్ఎం), టీ.లచ్చయ్య,(ఎస్సై), బీ.జయప్రకాష్, (బిజినెస్) పీ.బుచ్చిరెడ్డి (రిటైర్డ్ హెచ్ ఎమ్), ఏ.కొమురయ్య, (రిటైర్డ్ లెక్చరర్), పీ.రవీందర్ రెడ్డి(బిల్డర్), వీ.వీరనారాయణ చారీ(టీచర్), రాజయ్య,(రిటైర్డ్ ఎంప్లాయ్), జీ.రమేష్ (మ్యారేజి బ్యూరో)తో పాటు తదితరులు కృషి చేశారు.




## ప్రజా వాణిలో ఫిర్యాదులను స్వీకరించిన సీపీ

**హనుమకొండ, ఆయుధం;** పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం శాంతి భద్రతలకు సంబందించి ప్రజలు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను కలుసుకొని ఫిర్యాదులను అందజేశారు. ఫిర్యాదులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సంబదించిన పోలీస్ అధికారులకు ఫోన్ చేసి క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపి భాదితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ అదేశించారు. అదే విధంగా పోలీస్ సిబ్బంది సైతం శాఖ పరమైన సమస్యలపై సీపీ కలుసుకొని వివరించడం తో పాటు వినతి పత్రాన్ని అందజేశారు.

# మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ, ఆయుధం:** పరకాల మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. పరకాల మున్సిపల్ కమిషనర్‌గా గ్రూప్ 1 అధికారి పోతరాజు పవన్ ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో విధుల నిర్వహణ, మున్సిపాలిటీ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్ర అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సోమవారం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, పన్నుల వసూళ్లు, మౌలిక వసతుల కల్పన, ఇంటి నంబర్ల కేటాయింపు, పట్టణ ప్రణాళిక, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల నియంత్రణ, వివిధ గ్రాంట్ల కింద నిధుల వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ విస్తృతంగా సమీక్షించారు. మున్సిపల్ సేవలు ప్రజలకు సకాలంలో, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సేవలను నిర్దేశిత గడువులోగా అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. వీధి దీపాల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు విద్యుత్ వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.

వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన కమిషనర్ పోతరాజు పవన్ పట్టణ అభివృద్ధి, ప్రజా సేవలకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేసి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఏఈ రవీందర్, టీపీఎస్ సుమన, టీపీబీఓ సందీప్, జూనియర్ అకౌంట్స్ అధికారి అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్నీకల్ డీజిపీ వీడియో సమావేశంలో పాల్గొన్న సీపీ

**హనుమకొండ, ఆయుధం;** తెలంగాణ రాష్ట్ర టెక్నీకల్ డీజిపీ వి. వి.శ్రీనివాస్ హైదరాబాద్ నుండి నిర్వహించిన వీడియో సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తో పాటు వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం CCTNS 2.O, ఈ సాక్ష్యా అప్లికేషన్లలో నూతనంగా వచ్చిన అప్డేట్స్ ద్వారా కలిగే ప్రయోజనాలు, వాటిని వినియోగించాల్సిన విధానం టెక్నీకల్ విభాగంకు చెందిన అధికారులు పవర్ పాయింట్ ద్వారా వివరించారు.

# రవి కుటుంబానికి ఆర్థిక చేయూత



**వరంగల్, ఆయుధం:** వరంగల్ నగరం 42వ డివిజన్లోని రంగశాయిపేట లో గల మిత్ర పరపతి సంఘం సభ్యుడైన గుండు రవి అకాల మరణం చెందగా.. సంఘ కమిటీ సభ్యులు వారి నివాసానికి వెళ్లి వారి మృతదేహాన్ని పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రవి కుటుంబానికి మిత్ర పరపతి సంఘం కమిటీ అధ్యక్షులు చిగిరి కుమారస్వామి, కార్యదర్శి ఎలుగు సాంబేశం, మిగతా కార్యవర్గ సభ్యులు శంకేసి వెంకటేశ్వర్లు, బక్కి నాగేందర్ (వేణు ), దామర కొండ నిరంజన్, మండల నరసింహారావములు, మిగతా కార్యవర్గ సభ్యులు మిత్ర పరపతి సంఘం తరపున రూ. 50,000 నగదును కుటుంబసభ్యులకు అందజేసి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అన్నదాత ఆత్మగానం

కష్టాల కడలిలో కరిగే రైతన్న..!
కన్నీటి కాలువలో కలిసే రైతన్న..!

కొనుగోలు కేంద్రాల్లో కాచే నిరీక్షణ..!
కడగండ్ల వానలకు చెదిరే ఆకాంక్షణ..!

రైతే రాజు అన్నారు రైతన్నా..!
గిట్టుబాటు ధరను నిర్ణయించలేని స్థితిలో
నీవెన్నన్నా..!

పచ్చని పొలాల వెనుక నీ త్యాగ గాథను
ఎవరు గమనించారు..?
ప్రతి గింజలో దాగిన నీ జీవన వ్యథను ఎవరు
విన్నారు..?

దేశానికి వెన్నెముకవైన రైతన్నా..!
నీ చిరునవ్వు పూసే ఆ రోజుకై
ఎదురుచూస్తున్న కాలమన్నా..!



రచన: మంజుల పత్తిపాటి
ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్
9347042218

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695